TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :25 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.19.08.2025 పేజీలు : 8, వెల:రూ.2.00




# దేశంలో ఓట్ల దొంగలు



అమృత్ తెలంగాణ హైదరాబాద్ : దేశంలో ఓట్ల దొంగలు పడ్డారని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ నేతలు దొంగ ఓట్లతో కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారనీ, తెలంగాణలో కూడా ఈ తరహా కుట్రలకు తెరలేపారని చెప్పారు. మహారాష్ట్రలో ఎన్నికల కమిషన్ నాలుగు నెలల్లో కోటి ఓట్లను నమోదు చేసిందని గుర్తు చేశారు. ఈ రకంగా అంబేద్కర్ పుట్టిన గడ్డ మీద రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఓట్ల చోరీ దేశం నలుమూలలా జరుగుతోందనీ, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని గుర్తు చేశారు. బతికున్న వారిని చనిపోయినట్టుగా చూపారని తెలిపారు. ఈ కుట్రను రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పారు. తప్పు చేసిన వారిని వదిలేసి తప్పును ప్రశ్నించిన రాహుల్ గాంధీని ఎన్నికల కమిషన్ అఫిడవిట్ అడగటమేంటని ప్రశ్నించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలంటూ రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారనీ, త్వరలో తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతిస్తామని తెలిపారు. అందరం కలిసికట్టుగా ఓట్ చోరీ కుట్రదారుల భరతం పట్టాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ సూచనలను అమలు చేయడం తమ బాధ్యతనీ, ఆ క్రమంలో సమస్య వచ్చినప్పుడు పోరాడేందుకు బహుజనులు నైతిక మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్య ఒక్కటే బహుజనుల తలరాతలు మారుస్తుందని రేవంత్ చెప్పారు. నాణ్యమైన చదువు, ఉద్యోగాలు ఇచ్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. బహుజనులంతా ఉన్నత చదువులు చదివి రాజ్యాధికారం సాధించాలనీ, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాలనేవి వర్ధంతులు, జయంతుల కోసం కాదనీ, అవి వారి స్ఫూర్తిని మనలో రగిలించేందుకేనని చెప్పారు. అందుకే రాష్ట్రానికి గుండెకాయ లాంటి సచివాలయం సమీపంలో పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**అడ్డుకుంటోంది వాళ్లే...**

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రధాని నరేంద్రమోడీనేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనింగ్ పేరుతో ఖిలాషాపూర్ కోట చరిత్రను కాలగర్భంలో కలిపేందుకు కుట్రలు పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడే కోటపైకి వెళ్లి దాన్ని కాపాడి చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన చట్టం బీసీలకు శాపంగా మారిందన్నారు. దాన్ని సవరిస్తూ చేసిన ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారని తెలిపారు. ఐదు నెలలు గడిచినా బిల్లులను ఆమోదించకపోవడంతో బహుజనుల కోసం ఢిల్లీలో ధర్నా సైతం చేశామని గుర్తు చేశారు. బహుజనుల కోసం తాము చేసిన ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎందుకు రాలేదంటూ సీఎం నిలదీశారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగంలోనే లేవని గుర్తు చేశారు. అబద్ధాలతో బహుజనులకు అన్యాయం చేయాలని ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో బీసీల్లోని ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించగలరా? అంటూ ప్రధాని మోడీకి సవాల్ విసిరారు. 56 ఏండ్లుగా ఇవి అమలవుతున్నాయనీ, ఇప్పుడు మతం ముసుగులో బహుజనుల రిజర్వేషన్లను బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దే నాయకత్వాన్ని గాంధీ కుటుంబం దేశానికి అందించిందని చెప్పారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశ సమగ్రత కోసం కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించారని తెలిపారు. ఆ సందర్భంగా కులగణన చేసి తీరుతామని తెలంగాణ ప్రజలకు మాట ఇచ్చారనీ, గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే అది శిలాశాసనమేనని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా తెలంగాణలో తాము కుల గణన చేసి చూపించామంటూ చెప్పారు. పక్కా ప్రణాళిక ప్రకారం శాస్త్రీయంగా దాన్ని పూర్తి చేశామని ధీమా వ్యక్తం చేశారు. కులగణన ద్వారా బహుజనుల సంఖ్య 56.33 శాతంగా ఉందంటూ తేల్చామన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధితోపాటు రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు చట్టాలు చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే ఆయనపైనే చూపాలనీ, అంతేగానీ ఆయన సిద్ధాంతాలపై చూపొద్దంటూ కేంద్రంలోని మోడీ సర్కారుకు హితవు పలికారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు కే.కేశవరావు, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, బీసీ కార్పొరేషన్ చైర్మెన్ శ్రీకాంత్ గౌడ్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్యతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**మా మూల సిద్ధాంతమే సామాజిక న్యాయం : డిప్యూటీ సీఎం భట్టి**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తమ పార్టీ మూల సిద్ధాంతమే సామాజిక న్యాయమని అన్నారు. తెలంగాణలో చేపడుతున్న సంస్కరణలు, నిర్ణయాలు దేశానికే దశ, దిశా, నిర్దేశం చేస్తున్నాయని ఆయన తెలిపారు. భారత చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణనను చేపట్టామని వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేశామని గుర్తు చేశారు.

## జనజీవనం అస్తవ్యస్తం



అమృత్ తెలంగాణ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతా లను వరదలు ముంచ టత్తుతున్నాయి. ఏజెన్సీ ప్రజలు అల్లాడుతు న్నారు. వాగులు వంకలు పొంగిపొ ర్లుతున్నాయి. ప్రాజెక్టుల గేట్లు తెరవడంతో కాలువల కట్టలు తెగి పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, ములుగు, సంగారెడ్డి, కామారెడ్డి, మంచిర్యాల, కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరామసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద వస్తోంది. స్థానికంగా కురుస్తున్న వర్షాల తోపాటు మహా రాష్ట్ర నుంచి పెద్దఎత్తున వరద వస్తుండటంతో గోదావరి నది గుండా ప్రాజెక్టులోకి ప్రవహిస్తూ ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,25,400 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అధికారులు ప్రాజెక్టు 8 గేట్ల నుంచి 25వేల క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. క్రమంగా వరద పెరగడంతో సాయంత్రానికి 39 గేట్లు ఎత్తారు. ఎగువ ప్రాంతాల నుంచి లక్ష 52వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్టు ప్రాజెక్టు ఎస్ఈ తెలిపారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను తెరిచారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గాన్ని వరుణుడు వణికించాడు. ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. వాగులపై ఉన్న లోలెవల్ వంతెనలపై నుంచి వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. నిజాంసాగర్ మండలంలో 21.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు డీఈవో రాజు సెలవు ప్రకటించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

**మంజీరా నది వరదలో చిక్కుకున్న కాపరులు**

బిచ్కుంద మండలంలోని గుండెకల్లూర్ గ్రామానికి చెందిన యాదుగౌండ, సాయిగౌండ, షెట్లూర్ గ్రామానికి చెందిన చాకలి సాయిలు, జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన సాయిగౌండ నలుగురు కలిసి ఏడు వందల గొర్లను షెట్లూర్ గ్రామ శివారులోని మంజీర పరివాహక ప్రాంతమైన బసన్నగడ్డకు మేపడానికి తీసుకెళ్లారు. ఆదివారం రాత్రి బసన్నగడ్డపైనే విశ్రాంతి తీసుకున్నారు. ఎగువన కురిసిన భారీ వర్షాలతో నిజాంసాగర్ డ్యాం, కౌలాస్ డ్యాం నిండటం డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఒక్కసారిగా ప్రవాహం పెరిగింది. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు అప్రమత్తమై ఏస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని, పోలీస్ బెటాలియన్‌ను రప్పించారు. నాలుగు బోట్ల ద్వారా ఆరు గంటలపాటు శ్రమించి గొర్రెలు, కాపరులను సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు.

**ఉమ్మడి వరంగల్‌లో మూడు జిల్లాలకు రెడ్ అలెర్ట్**

ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. సోమవారం ఉదయం నుంచి వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. ములుగు జిల్లాలో అత్యధికంగా మంగపేట మండలంలో 17.7 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది.

**గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ చుట్టూ వరద నీరు చేరింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. జంపన్నవాగు ఉప్పొంగడంతో కొండాయి వద్ద రాకపోకలను నిలిపివేశారు. ఏటూరునాగారం-భద్రాచలం మధ్యలోని జీడివాగు ఉప్పొంగడంతో బస్సులు, లారీలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎర్రవాగు ఉధృతికి కమలాపురం గ్రామ భగత్ సింగ్ నగర్, ఇందిరా కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. భారీగా వరద నీరు ఇండ్లలోకి చేరింది. వరద ఉధృతి పెరగడంతో ప్రజలు అందిన వస్తువులను చేత పట్టుకొని ఇండ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. ములుగు జిల్లాలోని రామప్ప, లక్నవరం మధ్యతరహా ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి.

## యూరియా అమ్మకాలపై నిఘా పెంచాలి

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం



అమృత్ తెలంగాణ హైదరాబాద్ : రాష్ట్రంలో యూరియా అమ్మకాలపై నిఘా పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులు కూడా అవసరానికి మించి యూరియాను కొనొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కేటాయించిన విధంగా యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో యూరియా కొరతపై మంత్రి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, హాకా ఎమ్‌డీ చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ ఎమ్‌డీ కె.రాములుతోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా పరిస్థితులపై డైరెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి సరఫరా కావాల్సిన యూరియాలో పెద్ద లోటు ఏర్పడిందని తెలిపారు. దిగుమతుల ద్వారా సరఫరా కావాల్సిన యూరియా కోటాలో కొన్ని నెలల్లో కంపెనీలు అసలు సరఫరా చేయడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకోకుండానే బీజేపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. వానాకాలం సీజన్ ముందస్తుగా ప్రారంభం కావడం, మొక్కజొన్న లాంటి పంటలు అధికంగా సాగు చేయడంతో యూరియా కొరత ఉందన్నారు. యూరియాను వ్యవసాయానికి కాకుండా, ఇతర అవసరాల కోసం మళ్లించకుండా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## రాష్ట్ర కాంగ్రెస్ అసమర్థపాలన



అమృత్ తెలంగాణ హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతకాని పాలనతో గుజరాత్‌కు రూ.2,800 కోట్ల 'కేన్స్' పెట్టుబడి గుజరాత్‌కు వెళ్లిపోయిందని ఆరోపించారు. దీంతో రేవంత్ సర్కార్ తెలంగాణ యువతకు చెందిన ప్రత్యక్షంగా 2 వేల ఉద్యోగాలకు గండి కొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీకి ఏటీఎంలా రాష్ట్రాన్ని వాడుకుంటున్న కాంగ్రెస్ గత బీఆర్ఎస్ శ్రమను బూడిదలో పోసిన పన్నీరుగా మారుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలు తరలిపోతున్నా సీఎం రేవంత్ రెడ్డిలో చలనం కనిపించడం లేదని కేటీఆర్ విమర్శంచారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ శ్రమతో కర్నాటకకు వెళ్లాల్సిన కేన్స్ పరిశ్రమను తెలంగాణకు రప్పించిందని తెలిపారు. ఆ పరిశ్రమకు 10 రోజుల్లోనే కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ పక్కనే భూములు కేటాయించినట్టు గుర్తుచేశారు. బీఆర్ఎస్ పారదర్శక పాలన, చిత్తశుద్ధితో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ఆ సంస్థ కాంగ్రెస్ అవినీతి కారణంగానే రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఆటో పైలెట్ మోడ్‌లో ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి కేన్స్ తరలింపుపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక తెలంగాణ స్వయం విధ్వంసక మోడ్‌లోకి వెళ్లిందని ఆరోపించారు. తాము తెచ్చిన బ్రాండ్ హైదరాబాద్, బ్రాండ్ తెలంగాణ ఇమేజ్‌ను నిలబెట్టుకోలేదనీ, కమిషన్ల మీదే తప్ప పరిశ్రమలను కాపాడుకోవడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి శ్రద్ధ లేదని తప్పుపట్టారు. రాష్ట్రాభివృద్ధి, ఉద్యోగాల కల్పన గాలికొదిలేసిన రేవంత్ రెడ్డి తన సీఎం పదవి కాపాడుకోవడానికి ఢిల్లీ పెద్దలకు తెలంగాణను తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్-ఐపాస్ వంటి విప్లవాత్మక విధానాలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రపంచస్థాయి కంపెనీలను ఆకర్షించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో కేన్స్ టెక్నాలజీ సంస్థ గుజరాత్‌కు తరలిపోవడం ఒక హెచ్చరిక మాత్రమేననీ, ఇప్పటికైనా రేవంత్ సర్కార్ కళ్లు తెరవకపోతే మరిన్ని సంస్థలు తరలిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించాలని సూచించారు.

## సమస్యలు రాకుండా సింగూర్ ప్రాజెక్టుకు శాశ్వత పరిష్కారం

### డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకే నీరు విడుదల : మంత్రి దామోదర్ రాజనర్సింహ



అమృత్ తెలంగాణ పుల్కల్ : సింగూర్ ప్రాజెక్టుకు భవిష్యత్తులో ఎలాంటి సమస్యా రాకుండా శాశ్వత పరిష్కారం చూపనున్నట్టు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ ప్రాజెక్ట్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సింగూర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం డ్యామ్ సేఫ్టీ అధికారులు కొన్ని సూచనలు తెలియజేశారన్నారు. అందుకోసం ప్రభుత్వం రూ.16 కోట్లను విడుదల చేసిందన్నారు. దీనికి సంబంధించి టెండర్లు కూడా పూర్తి అయ్యాయని తెలిపారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు సూచనలకనుగుణంగా ప్రాజెక్టులో నీటిమట్టాన్ని ఉంచడం జరుగుతుందన్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా నీరు వచ్చి చేరుతుందని వాటిని దిగువ ప్రాంతాలకు వదిలేయడం జరుగుతుందన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకే నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అదేవిధంగా సింగూర్ రాజనర్సింహ ఎడమ కాలువను సీసీ చేసేందుకు ప్రభుత్వం రూ.160 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఆ నిధులను ఎడమ కాలువకు పూర్తిగా వినియోగిస్తామని చెప్పారు. ప్రస్తుతం రైతుల కోరిక మేరకు ఆ పనులు నిలిపివేసి వ్యవసాయానికి నీరు అందిస్తున్నామన్నారు. తర్వాత పనులను కొనసాగిస్తామన్నారు. అంతకుముందు మంత్రి దామోదర ఇసోజిపేట గ్రామంలో తెగిపోయిన ఎడమ కాలువను ట్రాక్టర్‌పై వెళ్లి పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశం చారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీఓ, ఇరిగేషన్ అధికారులు మండల అధికారులు ఉన్నారు

## వరంగల్ పంచాయితీపై ప్రత్యేక కమిటీ వేయండి

అమృత్ తెలంగాణ హైదరాబాద్ : వరంగల్ కాంగ్రెస్ నేతల మధ్య పంచాయితీ, అనంతరం జరిగిన పరిణామాలపై పార్టీ సీనియర్ నేతలతో ప్రత్యేక కమిటీ వేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ మల్లు రవి కోరారు. ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు లేఖ రాశారు. ఆ కమిటీ సభ్యులు ఆ జిల్లాకు వెళ్లి విచారణ జరుపుతారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. పలు జిల్లాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే కొండా మురళి రెండు దఫాలుగా క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చే వారం చర్చిస్తామన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..రోటి పండగ అన్నదాన కార్యక్రమం..పెద్ద ఎత్తున పాల్గొన్న గ్రామస్తులు..



తురాటిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నిర్మల్ జిల్లా తురాటి ఆగస్టు 18 అమృత్ తెలంగాణ తురాటి గ్రామంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి, వేడుకలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని వెన్నదొంగ శ్రీకృష్ణుడి వేషధారణలతో ఉట్టిని కొట్టి ఘనంగా సంబరాలు నిర్వహించడం జరిగింది అదేవిధంగా గ్రామంలో వీడిసి ఆధ్వర్యంలో రోటి పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది

## ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి



అమృత్ తెలంగాణ ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం పోలీస్ ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు ముఖ్య అధికారిని జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు కలిసి సమస్యలను తెలియజేశారు. దాదాపు 20 మంది ఫిర్యాదుదారులు ఫిర్యాదులను సమర్పించగా అందులో కుటుంబ కలహాలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, పలు కేసుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను ఇచ్చి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

## భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు ధ్వంసమైన రోడ్లు.. పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి..



భారీ వర్షానికి ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే







గ్రామాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

నిర్మల్ జిల్లా ముధోల్ ఆగస్టు18 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గం లో భారీ వర్షాల కారణం గ దెబ్బతిన్న పంటలను ధ్వంసమైన రోడ్లను, కల్వర్టులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి,. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

వర్షానికి బురదమయంగా మారిన రోడ్డు గుండా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

## జిల్లాలో భారీ వర్షాలు - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో భారీ వర్షాలు – ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ .భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు .సోమవారం లక్ష్మణచందా మండలం కనకాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్ల చుట్టూ చెత్త, నిల్వ నీరు ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటికే గ్రామంలో జ్వరాల బారిన పడిన వారి వివరాలు, అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందించాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాజేందర్, మండల ప్రత్యేక అధికారి అంబాజీ, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నష్టంపై నివేదికలు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి భారీ వర్షాల నష్టంపై నివేదికలు సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టంపై విభాగాలవారీగా పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, పంటలు, నివాస గృహాలు దెబ్బతిన్న ప్రాంతాలను తక్షణం సర్వే చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రహదారులు, వంతెనలు, దెబ్బతిన్న చోట్ల వెంటనే మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. వైద్య శాఖ అధికారులు ఫీవర్ సర్వే నిర్వహించి అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజక వర్గాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులు పంటల నష్టంపై సమగ్ర వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఆమె ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగించాలని, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జెడ్పీ సీఈఓ గోవింద్, సిపిఓ జీవరత్నం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యాన వన శాఖ అధికారి రమణ, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి డా. రాజేందర్, ఇంజనీరింగ్, మున్సిపల్, ఆర్.డబ్ల్యూ.ఎస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**గణపతి మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.**
**అధిక శబ్దం వచ్చే డీజే లకు అనుమతులు లేవు.**
**వినాయక చవితి మరియు నిమజ్జనం రోజు మండప నిర్వహణ జాగ్రత్తలు పాటించాలి.**
**నాణ్యమైన వస్తువులను మండల నిర్మాణానికి వినియోగించాలి.**
**గణపతి మండప నిర్వాహక సభ్యులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా పోలీసులతో సమన్వయ సమావేశం ఏర్పాటు.**
**దస్నాపూర్ తానిషా గార్డెన్ నందు పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు.**
**గణపతి మండప నిర్వహణ కమిటీ సభ్యులు చేయవలసిన సూచనలతో కూడిన కరపత్ర ఆవిష్కరణ.**
**సూచనలు తెచ్చిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లా గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉన్నందున, రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ముందస్తు చర్యల్లో భాగంగా గణపతి మండప నిర్వహ కమిటీ సభ్యులు మరియు హిందూ ఉత్సవ సమితి సభ్యులతో సమన్వయ సమావేశాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం ఈరోజు ఉదయం స్థానిక పట్టణంలోని తానిషా గార్డెన్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. మొదటగా వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి స్తోత్రాన్ని పటిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మండప నిర్వహణ కమిటీలు సభ్యులకు పలు సూచనలు చేయడం జరిగింది. స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ కాలం నందు బాలగంగాధర్ తిలక్ భారతీయులందరూ ఐక్యమత్తంగా ఉండడానికి స్థాపించిన ఈ గణపతి విగ్రహాల ఏర్పాటు అనే పండుగ, ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పోలీసు యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని మండప నిర్వహణ కమిటీ సభ్యులను ఉద్దేశించి పలు సూచనలు చేయడం జరిగింది. మండప నిర్వహణ కమిటీ సభ్యులకు ఆన్లైన్ నందు రిజిస్ట్రేషన్ చేసుకుని వివరాలను నమోదు చేయాలని సూచించారు. తద్వారా ఏర్పాటు చేయవలసిన బందోబస్తు కేటాయించవలసిన పోలీసు సిబ్బంది నిమర్జనం ఏర్పాట్లకు మరియు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాలలో సాధ్యమైనంతవరకు ఒకే గణపతి మండపం ఏర్పాటు చేసే విధంగా ప్రజలందరూ కలిసికట్టుగా ఉన్న భావాన్ని తెలియజేయాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, నూతనంగా ఏర్పాటు చేసే వారికి అనుమతులు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణం, జైనథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాలలో ఏర్పాటు చేయనున్న గణపతి మండప నిర్వాహక కమిటీ సభ్యులు అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, రూరల్ సీఐ కె ఫణిదర్, జైనథ్ సిఐ డి సాయినాథ్, ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సైలు సిబ్బంది, హిందు ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు బొంపల్లి హనుమాన్లు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారికి ఆదిలాబాద్ జిల్లా పోలీసుల సూచనలు



-వినాయక విగ్రహ ప్రతిష్టాపనకు https://policeportal.tspolice.gov.in/index.htm ద్వారా గణేష్ మండపం వివరాలు నమోదు చేసుకోవాలి. అందువలన పోలీసు పెట్రోలింగ్ భద్రత మరియు పోలీసు పికెట్ డ్యూటీలు వేయుటకు సులభంగా ఉంటుంది మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నివారించవచ్చు.

-గణపతి మండపాల వద్ద జరిగే కార్యక్రమాలకు బాధ్యత వహిస్తూ ప్రతి ఒక్క గణపతి మండప కమిటీ అధ్యక్షుడు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.

-గణేశుని మండపాల వద్ద 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు విగ్రహంతో పాటు ఉండాలి. జంతువులు మరియు కోతులు లోనికి రాకుండా చూసుకోవాలి.

-గణేశుని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలి.

-విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదు.

- వినాయక మండపం ఏర్పాటులో అన్ని మన్నికవున్న వస్తువులనే వాడాలి.

-ప్రజల తాకిడి, వర్షం పడితే నీళ్లు నిలవడం, గాలి వీచినపుడు ఇబ్బంది కలగడం, కూలిపోకుండా చూడటం వంటి బాధ్యతను కమిటీ సభ్యులు చూసుకోవాలి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

-విద్యుత్ శాఖ నుండి పవర్ సప్లయ్ మరియు రక్షణకు సంబంధించిన సూచనలు తీసుకోవాలి.

-విద్యుత్ కనెక్షన్లు, లైట్ల ఏర్పాటుకు నాణ్యమైన వైర్లను, పరికరాలను వినియోగించాలి మరియు ప్రమాదము జరగకుండా చూసుకోవాలి.

-మండపాల పైభాగంలో నీరు పడినా కిందకు జారిపోయే పట్టాలతో కప్పాలి.

-ప్రజలకు ఇబ్బంది కలిగే విధముగా దారిలో మండపాలు ఏర్పాటు చేయరాదు.

-ప్రైవేట్ ల్యాండ్ అయినచో మండపాలు ఏర్పాటు చేసే స్థలానికి యజమాని పర్మిషన్ తీసుకోవాలి.

-రాత్రి 10 గంటల తరువాత మైక్, సౌండ్ సిస్టమ్ ఉపయోగించి ప్రజలకు, ఇతరులకు ఇబ్బందులు చేయకూడదు.

-మండపాల పేరుతో ఎలాంటి లక్కీ డ్రాలు నిర్వహించకూడదు. అలాగే జూదాన్ని నిర్వహించరాదు. బలవంతపు చందాలు తీసుకోరాదు.

-గణేశుని మండపాల వద్దకు మద్యం సేవించి రాకుండా కమిటీ నిర్వాహకులు చూసుకోవాలి.

-ప్రతి మండపం వారు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకూడదు.

-మండపాల వద్ద ఎలాంటి టపాసులు కాల్చరాదు.

-పెద్ద పెద్ద శబ్దాలతో డిజెలు ఏర్పాటు చేయకూడదు.

-అత్యవసరం అయితే డైల్ 100కు కాల్ చేయాలి.

-వినాయకుని ఉత్సవాలను అందరూ భక్తిశ్రద్ధలతో మరియు సమైక్యంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచన.

-భక్తులు సందర్శించుకునేటపుడు క్యూలైన్ విధానం సరిగ్గా వుండే విధంగా చూసుకోవాలి.

-వినాయక చవితి నిమజ్జనం రోజున రంగులు చల్లడానికి అనుమతులు లేవు.

-ప్రతి గణపతి మండపం వద్ద అగ్ని ఆర్పడానికి కావలసిన నీరు ఇసుక లాంటివి ఏర్పాటు చేయాలి.

-కంటికి ప్రమాదంగా ఉండేటువంటి లైట్లకు డీజేల వద్ద ఉండే లైట్లకు అనుమతులు లేవని తెలిపారు.

-రంగురంగుల పేపర్లను చల్లే పరికరాలకు,వాటికి అనుమతులు లేవని తెలిపారు.

-గణపతి ఏర్పాటు పేరుతో జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ఉండాలి.

## పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయం - జిల్లా కలెక్టర్



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయం – జిల్లా కలెక్టర్. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్దార్ పాపన్న గౌడ్ సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడని కలెక్టర్ పేర్కొన్నారు. కుల, వర్గ భేదాలు లేకుండా సమానత్వాన్ని నమ్మిన పాపన్న గౌడ్ బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి విశేష కృషి చేశారని తెలిపారు. రైతుల హక్కుల కోసం పోరాడి, ప్రజల్లో ఆత్మగౌరవం, ధైర్యస్ఫూర్తి నింపారని, పాపన్న గౌడ్ పేరు నేటికీ సమానత్వం, పోరాటస్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, సిపిఒ జీవరత్నం, డిటిఒ సరోజ, గౌడ సంఘం నాయకులు ముష్కం రామకృష్ణహోహాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.


**ప్రజల రక్షణ, భద్రతకై 24 గంటలు బాధ్యతాయుతంగా పని చేసే వ్యవస్థ పోలీస్ వ్యవస్థ.**
**భారీ వర్షాల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తత.**
**సరైన సమయంలో న్యాయం జరిగినప్పుడు బాధితులకు లబ్ధి చేకూరుతుంది.**
**సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ.**
**దాదాపు 20 సమస్యలను జిల్లా ఎస్పీకి తెలియజేసిన ఫిర్యాదుదారులు.**
**సమస్యలను విన్న వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ సోమవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ముఖ్య అధికారిని జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు కలిసి సమస్యలను తెలియజేశారు. దాదాపు 20 మంది ఫిర్యాదుదారులు ఫిర్యాదులను సమర్పించగా అందులో కుటుంబ కలహాలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, పలు కేసుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను ఇచ్చి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమాజంలో 24 గంటలు ప్రజల రక్షణ భద్రతకై పనిచేసే ఏకైక వ్యవస్థ జిల్లా పోలీసు వ్యవస్థ అని తెలియజేస్తూ ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా వాగులు కల్వర్టులు వంతెనలు పొంగి ప్రవహిస్తున్న ప్రాంతాలలో పోలీసు సిబ్బందిని కేటాయించి రాకపోకలను మూసివేయాలని సూచించారు. జిల్లా ప్రజలు అసాంఘిక కార్యకలాపాలను జరుగుతున్న సమాచారం ఏదైనా మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో భాగంగా 8712659973 అనే నెంబర్ కి సమాచారాన్ని అందించవచ్చని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. వచ్చిన ఫిర్యాదుదారులలో పోలీసు వ్యవస్థ పరిధి దాటి ఉన్న ఆస్తి తగాదాలు, భూమి తగాదాలు పంచాయితీలు ఉన్నవాటికి చట్ట ప్రకారం ఉన్న నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో పరిష్కరించబడే ఏ ఫిర్యాదు నైనా వెంటనే స్వీకరించి పరిష్కరించి ప్రజలకు సరైన సమయంలో న్యాయాన్ని అందించి లబ్ధి చేకూర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మహిళ యాచకురాలిపై అత్యాచారానికి, దోపిడీకి, హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు అరెస్ట్ - వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్

**ఎలాంటి ఆధారాలు లేకున్నా పది రోజుల్లోనే చేదించిన కేసు.**
**తాగిన మైకంలో, కామం తో నేరానికి పాల్పడిన యువకుడు.**
**ఈనెల 8వ తారీఖున పట్టణంలో ఘటన.**
**ఇదివరకే అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తి పోస్టర్ను సైతం ఆవిష్కరించిన జిల్లా పోలీసులు.**
**ఈరోజు ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పట్టుబడ్డ నిందితడు.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : నిందితుని వివరాలు : మాడవి నగేష్ ఏ నాగోరావు ఏ నాగేశ్వర్, S/O రాము, వయస్సు: 25 సంవత్సరాలు, వృత్తి: కూలీ, నివాసం మల్కాపూర్ గ్రామ0 గుడిహత్నూర్ మండలం. ఈ నెల 8వ తారీఖున ఆదిలాబాద్ పట్టణంలోని ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితున్ని ఈరోజు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఎలాంటి ఆధారాలు లేకున్నా ప్రత్యేకంగా నిందితున్ని ఎలాగైనా పట్టుకోవాలని ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మహారాష్ట్ర తెలంగాణలోని 40 పోలీస్ స్టేషన్లలో గాలించడం జరిగిందని తెలిపారు. ఈరోజు మధ్యానం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరానికి పాల్పడిన విషయాన్ని ధ్రువీకరించినట్లు తెలిపారు. నిందితునికి గత మూడు సంవత్సరాల క్రితం భార్య నుండి విడిపోయి కూలి పని చేసుకుంటూ ఆదిలాబాద్ నందు ఉండడం జరుగుతుందని తెలిపారు. 8వ తారీకు రాత్రి సమయంలో మద్యం సేవించి కామ వాంఛను సంతృప్తి చేసుకోవాలని దురుద్దేశంతో మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. తదుపరి మహిళపై దాడి చేయగా మహిళ తలకు తీవ్ర రక్తస్రావంతో గాయాలు పాలవడం జరిగిందని, మహిళ యాచకురాలి వద్ద నుండి 300 రూపాయలను దొంగలించడం జరిగిందని తెలిపారు. తర్వాత మద్యం కోసం వెతికి దొరకని సందర్భంలో రైల్వే స్టేషన్ ద్వారా పర్లి వైద్యనాథ్ ట్రైన్ మార్గంలో పారిపోయారని తెలిపారు. నిందితునిపై హత్యాయత్నం, అత్యాచారం, దోపిడీ సెక్షన్ల కింద కేసును నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్ మరియు సిబ్బంది కైసర్ ఏఎస్ఐ, కానిస్టేబుల్ అశోక్, కరీం, రుక్మారెడ్డి, హనుమంతులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

## భారీవర్షాలు.. ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ టౌన్ : భారీ వర్షాల కారణంగా ప్రజలు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, నీటిబారిన వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు పలు సూచనలను పాటించాలని సూచించారు.

ప్రజలు ఈ సలహా సూచనలు పాటించాలి

1. మరిగించి చల్లార్చిన నీటినే తాగాలి.. శుద్ధి చేసిన నీరు మాత్రమే ఉపయోగించాలి.
2. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూల కుండీలు, కూలర్, టైర్లు, డబ్బాలలో నీరు నిల్వ లేకుండా తరచుగా శుభ్రం చేయాలి.
3. దోమల కాటుకు గురి కాకుండా మస్కిటో నెట్స్, కాయిల్, రిపెలెంట్స్ వాడాలి. పూర్తి బట్టలు ధరించాలి.. బయట వర్షపు నీటిలో ఆడకూడదు, నడవకూడదు.
4. బయట పాడైపోయే ఆహారం తినకూడదు. తాజాగా వండి వేడి వేడి ఆహారమే తీసుకోవాలి.
5. జ్వరం, వాంతులు, విరేచనాలు, కళ్లలో పసుపు, శరీర నొప్పులు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ దవాఖాన/పీహెచ్.సి/సీహెచ్.సీల ను సంప్రదించాలి. స్వయంగా మందులు వాడకూడదు.
6. గర్భిణీలు, చిన్నపిల్లలు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదకర ప్రాంతాల్లో ఉండే గర్భిణీలను సురక్షిత ప్రదేశాలకు తరలించవచ్చు.
7. ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవచ్చు. జిల్లా ఎపిడెమిక్ కంట్రోల్ రూమ్ నంబర్: 9491103108 ను సంప్రదించాలని సూచించారు.

## భారీ వర్షానికి తోడుగా ఓవైపు సాత్నాల, మరోవైపు పెన్ గంగా నది వరద ఉధృతి కారణంగా వేల ఎకరాల పంట నీట మునిగిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు



భారీ వర్షంతో పత్తి పంటను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్



ఎడ్ల బండి ఎక్కిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ . ఆదిలాబాద్ జిల్లాలో గత 3 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పంట నష్టపోయిన వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే సోమవారం విస్తృతంగా పర్యటించారు. బోరజ్ మండలంలోని కేదర్పూర్, ఆకోలి, గిమ్మ, కోరాట, మాండాగడ .పూసాయి, పిప్పర్ వాడ. తదితర గ్రామాల్లో తహసీల్దార్ రాజేశ్వరీ అగ్రికల్చర్ అధికారులు, బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండి పై ఎక్కి వాగులు దాటుతూ నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ భారీ వర్షాలకు దాదాపు 12 వేల ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశామన్నారు. పంట నష్టం తో పాటు తెచ్చుకున్న ఎరువులు సైతం తడిసి ముద్దాయి అని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా సిఎం రేవంత్ రెడ్డి గారికి ఉత్తరం రాసినట్లు తెలిపారు.

అదేవిధంగా జిల్లాలో పంట నష్టం వివరాలను కేంద్ర మంత్రులకు సైతం తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ రెడ్డి సన్నీ గంగాధర్ సంజు. శ్రీనివాస్. సర్వేష్ . మనోజ్ తదితరులు ఉన్నారు..

## వర్షంలో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ఆందోళన



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ టౌన్ పీఎం శ్రీ పాఠశాలలను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, పేస్ క్యాప్చర్, ఈకేవైసీ యాప్ లను రద్దుచేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.18 వేల వేతనం హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుండి ర్యాలీగా కలెక్టరేట్ కు తరలివచ్చి సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ హోరెత్తించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తమ నిరసనను వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ.. ఎం అంగన్వాడీ సెంటర్లలో ఉండాల్సిన పిల్లలతో పీఎం శ్రీ పాఠశాలలు ఏర్పాటు చేసి అంగన్వాడీ సెంటర్లను నిర్వీర్యం చేసే కుట్రలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నాలుతున్నాయని మండిపడ్డారు. పీఎం శ్రీ పాఠశాలలను అంగన్వాడీ కేంద్రంలోనే నిర్వహించాలని, పీఎం శ్రీ టీచర్లకు, ఆయాలకు ఇస్తున్న వేతనాన్ని అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు ఇవ్వాలని ఆ బడ్జెట్ ను అంగన్వాడీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫేస్ క్యాప్చర్, ఈకేవైసీ ఆన్లైన్ పేరుతో అంగన్వాడీలను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. నెట్ సిగ్నల్ సరిగా లేక, పాడైన ఫోన్లతో అటవీ ప్రాంతంలో ఎలా చేస్తారని ప్రశ్నించారు.

**అంగన్వాడీలపై వేధింపులు ఆపాలి**

అంగన్వాడీలకు వేధింపులను ఆపాలన్నారు. ఈ విద్యావాలంటీర్ల వేతనాలను అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు అందిస్తే తాము నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. అదే విధంగా ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నందున ప్రైమరీ పాఠశాలకు కేటాయించే నిధులు అంగన్వాడీలకు ఇవ్వాలన్నారు. తమ ఫోన్లు ఉన్నాయా లేదా వాటి గురించి పట్టించుకోకుండా ఫెసక్యాప్చర్ పంపాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. దాని కారణంగా నార్నూర్ ఓ అంగన్వాడీకి బ్రెన్ స్ట్రోక్ వచ్చిందన్నారు. ఎఫ్.ఆర్.సీ విధానంతో పేదలకు అంగన్వాడీల ద్వారా అందే సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.సుజాత, డీ.సునీతజ, లక్ష్మి, పార్వతి, మధునిక, విజయ, కళావతి పాల్గొన్నారు.

## కవ్వించి రెచ్చగొడుతున్న ఖిలాడీ గాళ్



మాస్ మహారాజా రవితేజ సరసన ఖిలాడీ చిత్రంలో నటించింది మీనాక్షి చౌదరి. తనదైన అందం నటనతో యువతరాన్ని మురిపించిన ఈ బ్యూటీ సోషల్ మీడియాల్లోను అంతే స్పీడ్ గా ఉంది. నిరంతరం ఈ అందాల భామ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. తాజాగా మరో హాట్ ఫోటోషూట్ మీనాక్షి సోషల్ మీడియాల్లో ప్రత్యక్షమైంది. మీనాక్షి ఈ ఫోటోగ్రాఫ్స్ లో టూ హాట్ గా కనిపిస్తోందంటూ బోయ్స్ కామెంట్లు చేస్తున్నారు. ఆమె అందానికి చలి జ్వరం ఖాయం! అంటూ ఫిదా అయిపోతున్నారు. మీనాక్షి తదుపరి హిట్ లో నటిస్తోంది. అలాగే కొలై అనే సినిమాలోను కథానాయికగా కనిపించనుంది. ఈ రెండు సినిమాల్లోను గ్లామర్ ఆవిష్కరణతో పాటు నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో నటిస్తోందని సమాచారం. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుస చిత్రాలకు సంతకాలు చేస్తోంది. ఇరుగు పొరుగు భాషల్లోను లక్ చెక్ చేసుకుంటోంది. ఇక స్కిన్ షోకి ఏమాత్రం అభ్యంతరం చెప్పని మీనాక్షి ఫోటోషూట్లలోను అస్సలు తగ్గడం లేదు. పెద్ద తెరపై పెదవి ముద్దులకు అభ్యంతరం చెప్పనని స్టేట్ మెంట్ ఇచ్చిన ఈ భామకు అవకాశాలిచ్చేందుకు మన దర్శకహీరోలకు ఆసక్తి పెరిగింది. డార్లింగ్ ప్రభాస్ సరసన సలార్ లో నటించే అవకాశం ఉందని కథనాలొచ్చినా ఎందుకనో ఆ ఛాన్స్ మిస్సయ్యింది. కానీ భవిష్యత్ లో అగ్ర నాయికగా ఎదిగేందుకు అవసరమైన అన్ని క్వాలిటీస్ ఈ అమ్మడిలో దండీగా ఉన్నాయని ట్రేడ్ విశ్లేషిస్తోంది. మోడల్ కం నటి మీనాక్షి అందాల పోటీ టైటిల్ హోల్డర్. ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. అక్కడ ఆమె మిస్ గ్రాండ్ ఇండియాగా కిరీటాన్ని పొందింది. చౌదరి మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. 1వ రన్నరప్ గా కిరీటాన్ని పొందింది. 2021లో తెలుగు చిత్రం ఇచ్చట వాహనములు నిలుపరాదు తో తెరంగేట్రం చేసింది. మొదటి సినిమాతోనే ఆకట్టుకున్న ఈ బ్యూటీకి అవకాశాల పరంగా కొదవేమీ లేదు. అయితే సెలక్టివ్ గా కెరీర్ ని ముందుకు నడిపిస్తోంది.

## చిరు-ఓదెల ప్రాజెక్ట్.. నాని కామెంట్స్ విన్నారా?

దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నేచురల్ స్టార్ నిర్మాతగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నేచురల్ స్టార్ నిర్మాతగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఇంకా సెట్స్ పైకి వెళ్లని ఆ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అనౌన్స్మెంట్ తోనే చిరు– ఓదెల– నాని ప్రాజెక్ట్ పై ఫ్యాన్స్, ఆడియన్స్ వేరే లెవెల్ లో అంతా హోప్స్ పెట్టుకున్నారనే చెప్పాలి. అయితే ఆ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. సినిమా ఎలా ఉండనుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మూవీ అప్డేట్స్ రావడం లేటు.. సోషల్ మీడియాలో అంతా వైరల్ చేస్తున్నారు. తాజాగా నాని.. తన అప్ కమింగ్ మూవీ హిట్–3 ప్రమోషన్స్ లో ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. విజయ్ దేవరకొండ ప్యారడైజ్ మూవీ తర్వాత చిరంజీవి ప్రాజెక్ట్ పనులు స్టార్ట్ అవుతాయని నాని తెలిపారు. ప్యారడైజ్ మూవీ షూటింగ్ మరికొద్ది రోజుల్లో మొదలవుతుందని చెప్పారు. మెగాస్టార్



సినిమాను 2027లో విడుదల చేస్తామని వెల్లడించారు. సినిమాకు సంబంధించిన అన్ని అప్డేట్స్ మరికొద్ది రోజుల్లో ఇస్తామని నేచురల్ స్టార్ పేర్కొన్నారు. సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యాక.. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, టైటిల్ వంటి మరిన్ని అప్డేట్స్ ను తప్పకుండా ఇస్తామని అన్నారు. అదే సమయంలో తాను చిన్నప్పటి నుంచి సత్యం థియేటర్ వద్ద చిరంజీవి సినిమా పోస్టర్స్ పెరిగానని చెప్పారు. ఆయనంటే తనకు మాటల్లో చెప్పలేని అభిమానముందని వెల్లడించారు. అదే సమయంలో ఇప్పుడు మెగాస్టార్ సినిమాకు నిర్మాతకు వ్యవహరిస్తుంటే.. ఒక బయోపిక్ తీస్తున్న ఫీలింగ్ కలుగుతుందని నాని అన్నారు. ఎప్పుడూ ఆ మూవీ కోసమే ఆలోచిస్తున్నానంటూ చెప్పారు. ఫ్యాన్ బాయ్ మూమెంట్ కోసం ఈగర్లీ వెయిటింగ్ అని తెలిపారు. దీంతో నాని కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. అయితే చిరంజీవి-శ్రీకాంత్ మూవీ స్టార్ట్ కావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. వచ్చే ఏడాది షూటింగ్ మొదలు కావచ్చు. కానీ నాని మాత్రం ఆ ప్రాజెక్ట్ పై ఫుల్ ఫోకస్ పెట్టినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఎంతైనా ఫ్యాన్ కదా అందుకేనేమో. మరి ఆ సినిమా ఎప్పుడు మొదలవుతుందో.. ఎప్పుడు వస్తుందో.. ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## అనుపమని పట్టించుకోరేంటి..? అదేంటి ఎందుకలా అంటే..

కెరీర్ మొదట్లోనే కుర్రాళ్ల హృదయాలను దోచేసిన ఈ ముద్దుగుమ్మ బొద్దుగా ఉంటే ఛాన్స్ లు రావట్లేదని సన్నగా మారింది అందాల అనుపమని టాలీవుడ్ లో పట్టించుకునే వారు కరువయ్యారు. అదేంటి ఎందుకలా అంటే.. కెరీర్ మొదట్లోనే కుర్రాళ్ల హృదయాలను దోచేసిన ఈ ముద్దుగుమ్మ బొద్దుగా ఉంటే ఛాన్స్ లు రావట్లేదని సన్నగా మారింది. అనుపమలోని ఈ మేకోవర్స్ కొంతమంది ఫ్యాన్స్ కి నచ్చినా కొంతమందికి మాత్రం రుచించలేదు. అయినా సరే ఒకసారి ఇష్టపడ్డాక తప్పదు కదా అనుకుంటూ ఆమెని అభిమానిస్తూ వచ్చారు. అదేంటో అందం అభినయం రెండు ఉన్నా కూడా అంపమకి లక్ కలిసి రాలేదు. తెలుగులో సినిమాలు చేసినా కూడా స్టార్ స్టేటస్ అందుకోలేదు. కెరీర్ లో సినిమాలు పడుతున్నా కొద్దీ స్టార్ హీరోలతో నటించే ఛాన్స్ అందుకోవాలి. కానీ అమ్మడి గ్రాఫ్ పడిపోతూ యువ హీరోలతో నటించే పరిస్థితి వచ్చింది. అఫ్కోర్స్ ఆ సినిమాలు కూడా పాపులారిటీ తెచ్చే ఛాన్స్ ఉంటుంది. కానీ అనుపమ మాత్రం ఆశించిన స్థాయిలో క్రేజ్ తెచ్చుకోలేదు. లాస్ట్ ఇయర్ తెలుగులో ఈగల్, టిల్లు స్క్వేర్ సినిమాలు చేసింది అమ్మడు. టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ పడినా కూడా అమ్మడికి తర్వాత పెద్దగా ఛాన్స్ లు రాలేదు. ప్రస్తుతం అమ్మడు పరదా సినిమా చేస్తుంది. ఆ సినిమా టీజర్ తో ఆడియన్స్ లో ఆసక్తి కలిగేలా చేశారు. ఇక



మరోపక్క కోలీవుడ్ స్టార్ చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ తో బిసన్ అనే సినిమా చేస్తుంది అమ్మడు. లాక్ డౌన్ అనే సినిమా కూడా చేస్తుంది అనుపమ. మలయాళంలో కూడా పెట్ డిటెక్టివ్ సినిమా చేస్తుంది అనుపమ. దానితో పాటు జె.ఎస్.కె ట్రూత్ షల్ ఆల్వేస్ అనే సినిమా చేస్తుంది. తమిళ, మళయాళ భాషల్లో పర్వాలేదు కానీ తెలుగులో మాత్రం అనుపమని పట్టించుకోవట్లేదు. రీసెంట్ గా డ్రాగన్ సినిమాతో తమిళంతో పాటు తెలుగులో కూడా సక్సెస్ అందుకుంది అనుపమ పరమేశ్వరన్. ఐతే టాలీవుడ్ లో అమ్మడికి ఛాన్స్ లు రాకపోవడానికి కారణం ఏంటన్నది తెలియట్లేదు. ఏది ఏమైనా అనుపమ విషయంలో తెలుగు మేకర్స్ ఏం ఆలోచిస్తున్నారు




## దిశ స్టైలిష్ లుక్ ఎలివేషన్ సో హాట్!



దిశా పటానీ టెంప్టింగ్ ఫోజుల గురించి చెప్పాల్సిన పనిలేదు. యువతలో నిత్యం అమ్మడి హాట్ ఫోజులు హాట్ టాపిక్. డిజైనర్ సహా అల్ట్రా మోడ్రన్ బ్యూటీగానూ అమ్మడు అగ్గి రాజేస్తుంది. ఇటీవలే మిర్రర్ సెల్ఫీలో బ్యూటీ ఓ రేంజ్ లో సెగలు పుట్టించింది. తాజాగా అమ్మడి న్యూ లుక్ ఒకటి నెట్టంట కుర్రాళ్లలో గుబులు రేపుతుంది. స్టైలిష్ బ్రాండెడ్ జీన్స్ పై బ్లాక్ కలర్ స్కిన్ టైట్ వేర్ లో అగ్గిరాస్తుంది. చినుగుల జీన్స్ చుట్టూ గోల్డ్ కలర్ చైన్ న్యూవేర్ ని మరింత ఫోకస్డ్ గా ఎలివేట్ చేస్తోంది. అమ్మడి స్కిన్ టోన్ ని టాప్ మరింత ఆకర్షణీయంగా మలిచింది. అమ్మడి క్లీవేజ్ అందాలు.. ఆ నడుం ఒంపు సొంపులు కుర్రాళ్లకి కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండు చేతులు పైకెత్తి..ఆ నడుముని కాస్త 45 డిగ్రీలు బెండు చేసిన ఫోజు వావ్ అనిపించలే. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. దిశ అభిమానులు ఆ అందాన్నితనవి తీరా చూసి ఆస్వాదిస్తున్నారు. ఇక కామెంట్ల వర్షానికైతే కొదవలేదు. ఎవరి స్టైల్లో వారు చెలరేగుతున్నారు. ఇక అమ్మడి కెరీర్ విషయానికి వస్తే 'లోఫర్' తర్వాత బాలీవుడ్ లో బిజీ అయిన సంగతి తెలిసిందే. హిందీలో బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు అందుకుని దూసుకుపోతుంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com